www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 21 | ఏప్రిల్ | 2025 పేజీలు 6

## విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని పెంచడానికే మోడల్ ఎంసెట్

2 లో




-పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఒత్తిడిని తట్టుకుని విజయాలు సాధించాలి
-ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ నేత బాగం
-జిల్లా వ్యాప్తంగా మోడల్ ఎంసెట్, నీట్ విజయవంతం

# అసైన్డ్‌కు పట్టా దక్కేనా..?


అసైన్డ్ భూమి (ఫైల్)




-భూ లెక్కను భూ భారతి సరి చేస్తుందా...?
-పోడు పట్టాల సంగతేంటి..?

**ప్రజాపక్షం/ఖమ్మం :** కొత్త చట్టం అమల్లోకి వచ్చే ముందు విస్తృత చర్చ జరుగుతుంది జరగాలి కూడా. అతి ముఖ్యమైన భూ భారతి చట్టం అమలు ముందు గ్రామీణ ప్రాంతాల్లో పలు అనుమానాలు, ఆశలతో కూడిన చర్చ మొదలైంది. ధరణి లోపాలను సవరించడంతో పాటు అనుభవదారులుగా ఉండి భూమిపై హక్కు లేని వారికి ఈ చట్టం హక్కు కల్పిస్తుందా...? వాస్తవంగా భూమి లేకుండా కేవలం పట్టాదారు పాసుపుస్తకాలకే పరిమితమైన భూముల సంగతిని తేలుస్తుందా అన్న దానిపై విస్తృతంగా చర్చ సాగుతుంది. ధరణిలో రెవెన్యూ గ్రామంలో ఉన్న మొత్తం భూమికి, రికార్డుల్లో ఉన్న భూమికి మధ్య వ్యత్యాసం ఉంది. కొన్ని గ్రామాల్లో భూమి మిగతా 2లో..

## చివరి ఆయకట్టుకు సాగునీరు



-తక్కువ ఖర్చుతో నిర్మించబడే ప్రాజెక్టులకు ప్రాధాన్యత : ఉప ముఖ్యమంత్రి భట్టి
-మధిరలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/మధిర :** చిట్ట చివరి ఆయకట్టుకు సాగునీటిని అందించేలా పటిష్ఠ చర్యలు చేపట్టినట్లు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వం భారీగా అప్పులు చేసి ఆయకట్టుకు సాగునీటిని అందించడంలో వైఫల్యం చెందిందని ఆయన ఆరోపించారు. తక్కువ ఖర్చుతో సాగునీటిని అందించే లక్ష్యంతో ప్రాజెక్టులను చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఆదివారం ఖమ్మంజిల్లా మధిర మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మిగతా 2లో..

## 27న తెలంగాణ జన జాతర



-ముగ్గురు మంత్రులున్నా రైతులను పట్టించుకోవడం లేదు..
-నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 20వేల పరిహారం ఇవ్వాలి
-ఈ ప్రభుత్వం ప్రజా మద్దతు కోల్పోయింది

**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత రాష్ట్ర సమితి రజతోత్సవం సందర్భంగా ఏప్రిల్ 27న తెలంగాణలో జన జాతర జరగనుందని బిఆర్ఎస్ నాయకురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత తెలిపారు. ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చిన బిఆర్ఎస్ పాలనను తెలంగాణ ప్రజలు తిరిగి కోరుకుంటున్నారని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా మద్దతును కోల్పోయిందని ఆమె తెలిపారు. ఖమ్మం పర్యటనలో భాగంగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఇంటి వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో ముగ్గురు మంత్రులున్నా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే చర్యలు తీసుకోలేకపోయారని అసలు రైతుల గురించి పట్టించుకోవడం లేదని మిగతా 2లో..

# అసైన్డ్‌కు పట్టా దక్కేనా..?



(మొదటిపేజీ తరువాయి)

మొత్తం రికార్డుల్లోకి చేర్చబడలేదు. మరి కొన్ని గ్రామాల్లో ఉన్న భూమి కంటే రికార్డుల్లో వందల ఎకరాల్లో ఎక్కువగా ఉంది. ఇదే నేపథ్యంలో 1970 దశకంలో ఇందిరా గాంధీ ప్రధానిగా గ్రామీణ ప్రాంతాల్లో భూమి లేని పేదలకు ముఖ్యంగా దళితులు, గిరిజనులకు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఎకరాల భూమి పంపిణీ చేయబడింది. ఇందులో బంజర భూములు, మాన్యాలు, ప్రభుత్వ భూములు, భూదాన్ భూములు, సీలింగ్ భూములు ఉన్నాయి. తెలంగాణ భారతదేశంలో విలీనం తర్వాత గ్రామాలను వదిలి వెళ్లిన జమీందార్, జాగీర్‌దారు భూములను కూడా పేదలు అనేక దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నారు. వీరిలో ఒకట్రెండు శాతం మంది రైతులకు పట్టా హక్కు కల్పించిన మిగిలిన వారికి హక్కులు కల్పించబడలేదు. ఒకప్పుడు పడావ్ పడి విలువ లేని భూములుగా ఉన్న వీటికి మారిన పరిస్థితుల్లో భూ విలువ పెరిగిన నేపథ్యంలో విపరీతమైన డిమాండ్ ఉంది. బంజరు, మాన్యాలు, ఈనామ్ భూముల్లో పలు చోట్ల కర్మాగారాలు, సంస్థలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ భూములు ఇప్పటికీ పలువురి చేతులు కూడా మారాయి. ప్రధానంగా ఒక అంశాన్ని గమనిస్తే తొలి నుంచి ఈ భూములను సాగు చేసుకుంటున్న వారికి హక్కులు కల్పించని అధికార యంత్రాంగం పేదల వద్ద భూములు కొని కర్మాగారాలు, విద్యా సంస్థలు లేదా ఇతరత్రా నిర్మాణాలు చేపట్టిన వారికి పట్టాదారు పాసు పుస్తకాలు అందించారు. కానీ అనాది నుంచి భూమి సాగు చేసుకుంటున్న వారికి మాత్రం ఏదో ఒక కొర్రీపెట్టి హక్కు కల్పించబడలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 15,83,500 కుటుంబాలకు 22,24,500 ఎకరాలను పేదలకు పంచినట్లుగా భూ రికార్డులు చెబుతున్నాయి. దీనితో పాటు 14,800 ఎకరాల భూ దాన్ భూములను 39,400 ఎకరాల సీలింగ్ భూములను కూడా పేదలకు పంచారు. వీటిని కొనుగోలు చేసిన వారికి హక్కులు కల్పించిన ప్రభుత్వం సాగు చేసుకుంటున్న వారికి మాత్రం హక్కులు కల్పించబడలేదు. ధరణిలో వీటి ఊసెత్త లేదు.

### భూ భారతి భూ లెక్క తేల్చేనా...!

భూ విస్తీర్ణం దానితో పాటే సాగు భూమి, అటవీ భూమి, నిర్ధాక భూముల విషయంలో పొంతన లేని లెక్కలు ఉన్నాయి. ఉదాహరణకు సాగు భూమి విషయంలో రైతుల వద్ద ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలకు, వాస్తవ భూ విస్తీర్ణానికి మధ్య తేడాలున్నాయి. ఎప్పుడో 19వ శతాబ్దం తొలినాళ్లలో తెలంగాణలో నిజాం పాలనలో మొత్తం భూ సర్వే జరిగింది. సర్వే నెంబర్ల వారీగా ఉర్దూలో భూ వివరాలను నమోదు చేశారు. డొంకలు, రోడ్లు, నివాస స్థలాలు, నిరర్థక భూముల వివరాలతో పాటు నీటి వసతులను కూడా ఆనాడు భూ రికార్డుల్లో నమోదు చేశారు. రాను రాను నిరర్థక భూములు సాగు భూములుగా మారడం జరిగింది. ఇప్పుడు ఒక సర్వే నెంబరులో ఉన్న భూ విస్తీర్ణానికి వాస్తవ విస్తీర్ణానికి మధ్య పొంతన లేదు. ఇప్పుడు సర్వే నెంబర్ల ప్రకారమే రైతులు అనుభవదారులుగా ఉన్నారంటే అది లేదు. భూ సర్వేనే దీనికి పరిష్కారమన్నది అందరి వాదన. భూ భారతి ద్వారా అక్రమార్కులకు అవకాశం కల్పించకుండా పటిష్ట చర్యలు తీసుకోవాల్సి ఉంది. ధరణి సమయంలో పైరవీకారులు ఇష్టానుసారంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందారు. వివాదస్పద భూములను సైతం తమ పేరున రికార్డుల్లోకి ఎక్కించుకున్నారు. ఓ దశలో రెవెన్యూ కార్యాలయాలు పైరవీలకు అడ్డాలుగా మారాయి. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండడంతో పాటు భూమి కలిగిన ప్రతి రైతుకు భూమిపై హక్కు పొందేవిధంగా ధరణిలో పొందుపర్చాల్సి ఉంది.

### పోడు సంగతేంటి..?

భూ హక్కులు, చట్టాలు అనే విషయం ప్రస్థావనకు రాగానే పోడు భూముల విషయం కూడా ప్రస్తావనకు వస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ మినహాయిస్తే మిగిలిన తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో పోడు సమస్య ఉంది. 2006కు పూర్వం సాగు చేసుకుంటున్న పోడు రైతులకు భూమిపై హక్కు కల్పిస్తామని చెప్పినప్పటికీ అది వాస్తవ రూపం దాల్చలేదు. 2006 నాటికి సాగు చేసుకుంటున్న భూమికి సంబంధించి 1,83,257 వ్యక్తిగత దరఖాస్తులు రాగా వన సంరక్షణ సమితుల నుంచి 3,427దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తుల ద్వారా మొత్తం 6,31,000 ఎకరాలకు హక్కు కల్పించాలని కోరగా కేవలం 3,00,284 ఎకరాలకు మాత్రమే హక్కు కల్పించారు. 3,30,000 ఎకరాలకు పైబడి భూమికి హక్కులు కల్పించాల్సి ఉంది. సాగు దారులను ప్రతి ఏడాది జూన్ మాసంలో బెదిరించడం, రైతులకు, అటవీ అధికారులకు మధ్య ఘర్షణలు జరగడం పరిపాటైంది. ఇటువంటి సమస్యలకు తావివ్వకుండా 2006కు పూర్వం సాగు చేసుకుంటున్న ప్రతి పోడు రైతుకు భూ భారతి చట్టం ద్వారా హక్కు కల్పించాల్సి ఉంది. యూనిక్ కోడ్‌ను ప్రతి రైతుకు అందించడంతో పాటు రెవెన్యూ గ్రామాల్లో ఉన్న ప్రతి సెంట్‌కు హక్కుదారుని తేల్చాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉంది. ఆ దిశగా భూ భారతి చట్టం రెవెన్యూ తప్పిదాలకు తావివ్వకుండా రైతులను బాధితులుగా మార్చే వ్యవస్థను తిరిగిన తేకుండా రూపొందించి అమలు చేయాలని రైతాంగం కోరుతుంది.

## పువ్వాడకు కవిత పరామర్శ



ప్రజాపక్షం/ఖమ్మం : సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావును ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత ఆదివారం పరామర్శించారు. పువ్వాడ తీవ్ర అనారోగ్యానికి గురైన విషయం విధితమే. విషయం తెలుసుకున్న కవిత పువ్వాడను కలిసి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. కవిత వెంట మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సి తాతా మధు, మాజీ ఎంఎల్‌ఎలు మదన్‌లాల్, హరిప్రియ, చంద్రావతి లు ఉన్నారు.

# చివరి ఆయకట్టుకు సాగునీరు



(మొదటిపేజీ తరువాయి)

మధిర మండలం సిరిపురం గ్రామంలో 1240 ఎకరాలకు సాగునీటిని అందించే లక్ష్యంతో వైరా నదిపై రూ. 6.85 కోట్లతో చెక్‌డ్యాం నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మహదేవ పురం గ్రామంలో 952 ఎకరాలకు సాగునీటిని అందించే రూ. 12.14 కోట్ల వ్యయంతో నిర్మించే ఎత్తిపోతల పథకాన్ని ఆయన ప్రారంభించారు. రాయపట్నం గ్రామంలో 1079 ఎకరాలకు సాగునీటిని అందించే లక్ష్యంతో చేపట్టిన ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. మధిర మున్సిపాలిటీలో రూ. 25 కోట్ల వ్యయంతో నిర్మించే రెండు వరుసల రహదారి విస్తరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ సిరిపురం వద్ద నిర్మించే చెక్‌డ్యాం ద్వారా ఈ ప్రాంతంలో భూ గర్భ జల నీటి మట్టం పెరుగుతుందని దీనికి పై భాగంలో ఉన్న చిన్న ఎత్తిపోతల పథకాలకు సమృద్ధిగా నీరు అందుతుందన్నారు. పేదల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజా ప్రభుత్వం సమాంతరంగా చేపడుతుందన్నారు. కార్పొరేట్‌కు దీటుగా పేదల పిల్లలు చదువుకోవాలని యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాలను నిర్మిస్తున్నామని తెలిపారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని మొదటి దశలో నిరుపేదలకు మంజూరు చేస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. రైతు సంక్షేమం దిశగా రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా, సన్న ధాన్యం రైతులకు రూ. 500 బోనస్, రైతుబీమాను అందిస్తున్నామన్నారు. మహిళలను సంపన్నులుగా మార్చే దిశగా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద పనులు చేపట్టామని ఇందిరమ్మ క్యాంటీన్‌లు, పెట్రోల్ బంకులు, రైసుమిల్లుల ఏర్పాటుకు ప్రాధాన్యత నిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు రమేష్‌బాబు, శ్రీనివాసాచారి, యుగంధర్, వాసంతి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని పెంచడానికే మోడల్ ఎంసెట్






ప్రజాపక్షం/ఖమ్మం : విద్యార్థుల్లో ఉన్న మానసిక స్థైర్యాన్ని పెంపొందించటానికే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే మోడల్ ఎంసెట్ పరీక్ష ఉపయోగపడుతుందని విద్యార్థులు పోటీ ప్రపంచంలో ఒత్తిడిని తట్టుకుని విజయాలు సాధించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ నాయకులు బాగం హేమంతరావు తెలిపారు. ఆదివారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో స్థానిక డాక్టర్స్ అకాడమీలో మోడల్ ఎంసెట్, నీట్ ఇంజనీరింగ్ ప్రశ్నాపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మోడల్ పరీక్షలు రాయడం వల్ల విద్యార్థులకు పరీక్షల పట్ల ఒక అవగాహన వస్తుందని తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే ఎంసెట్, నీట్ పరీక్షల్లో విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా ఉండేందుకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గత 26 ఏళ్లుగా మోడల్ ఎంసెట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నీట్ విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఈ పరీక్ష ఉంటుందన్నారు. ప్రభుత్వం నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు విద్యార్థులకు సమయం వృథా కాకుండా పరీక్ష ఎలా రాయాలో అనేది అవగతం అవుతుందన్నారు. విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పరీక్ష రాయాలని ఆయన తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల విజయమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ఒత్తిడిని తట్టుకుని విజయం సాధించాలన్నారు. సమాజంలో పోటీ పెరుగుతుందని పోటీకి తగినట్లుగా కష్టపడి ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ అకాడమీ ప్రిన్సిపాల్ ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శులు నాగులమీరా, శివనాయక్, జిల్లా నాయకులు ఉస్మాన్, ప్రతాప్, రాకేష్, రోహిత్, రాహుల్, గోపి తదితరులు పాల్గొన్నారు.

# 27న తెలంగాణ జన జాతర

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతుల కష్టాలకు సంబంధించి ఒక రివ్యూ సమావేశమైన నిర్వహించారా అని ఆమె ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తర్వాత ఆ స్థాయిలో ఉన్న ఉప ముఖ్యమంత్రి ఖమ్మంజిల్లాకు చెందిన వారే అయినప్పటికీ ఖమ్మంజిల్లాకు చేసింది ఏమి లేదన్నారు. మంత్రులు ఆధిపత్య పోరులో ఉన్నారు తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని కవిత తెలిపారు. ఒకప్పుడు ఖమ్మం అంటే కమ్యూనిస్టుల జిల్లాగా ఉందని ఇప్పుడు కమ్యూనిస్టు పెద్దలు ప్రశ్నించడం లేదని ఆమె తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది లోపే జిల్లాలో భక్తరామదాసు ప్రాజెక్టును నిర్మించి 60వేల ఎకరాలకు సాగునీటిని అందించడం జరిగిందని ఆమె తెలిపారు.కాంగ్రెస్ పాలనను చూసి కాంగ్రెస్ కార్యకర్తలే బాధపడుతున్నారని ముఖ్యమంత్రి కాంగ్రెస్ అగ్రనేతలపై కేసులు పెట్టిన స్పందించే స్థితిలో లేరన్నారు. అకాల వర్షాలకు రైతులు పడుతున్న ఇబ్బందులను గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నష్టపోయిన రైతులకు ఎకరాలకు రూ. 20వేల పరిహారం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పాలన పడకేసిందని చెప్పిన ఏ ఒక్క పనిని అమలు చేయలేదన్నారు. రైతు రుణమాఫీ విషయంలో ఘోరమైన అబద్ధాలు చెప్పారని కూలీలకు ఇస్తామన్న ఇందిరమ్మ భరోసా ఎటుపోయిందని ఆమె ప్రశ్నించారు. ప్రతిపక్ష పాత్రను బిఆర్ఎస్ సమర్థవంతంగా పోషిస్తుందన్నారు. బిఆర్ఎస్‌కు ఖమ్మంజిల్లాలో బలమైన నాయకత్వం ఉందని ఇక్కడ నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు రజతోత్సవ సభకు భారీగా తరలి రావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సి తాతా మధుసూదన్, మాజీ ఎంఎల్‌ఎలు మధన్‌లాల్, బానోత్ హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్‌జెసికి పరామర్శ...

ఇటీవల అనారోగ్యానికి గురైన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్‌జెసి కృష్ణను ఎంఎల్‌సి కవిత పరామర్శించారు.ఆర్‌జెసి శస్త్ర చికిత్స చేయించుకున్న తర్వాత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

# ప్రభుత్వం వాగ్దానాలను అమలు చేయాలి

**- సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా**
**- ముత్తగూడెంలో అట్టహాసంగా బికేఎంయు శాఖ మహాసభ**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** రైతులకు ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలన్నీటిని ప్రభుత్వం అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా అన్నారు. ఆదివారం ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురంమున్సిపాలిటీపిరిధిలోని ముత్తగూడెంలో తెలంగాణ వ్యవసాకార్మిక సంఘం(బికేఎంయు అనుబంధం) శాఖ మహాసభను చెరుకుపల్లి రామస్వామి అధ్యక్షతలన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు...ఇప్పటి వరకు ఏర్పాటైన చట్టాలన్ని కార్మికుల పోరాటాల ద్వారానే వచ్చాయన్నారు. పాలకులు వ్యవహరిస్తున్న పోకడలపై మరల అటువంటి పోరాటాలకు సిద్ధమై హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. భూమిలేని వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.6వేలు ఇవ్వాలన్నారు. అలాగే వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకువచ్చి జీవించే హక్కును కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడిగా మంగయ్య, ప్రధానకార్యదర్శిగా సంగయ్య, సహాయకార్యదర్శిగా రాములు, ఉపాధ్యక్షులుగా రామస్వామి, సభ్యులుగా సత్యనారాయణ, నరసమ్మ, కలమ్మ, శ్రీను, బిక్షం, మల్లమ్మ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(బికేఎంయు అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పగీళ్ల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ సవరణ చట్టం 2025 రాజ్యాంగ వ్యతిరేకం

**-సంఘటిత ఉద్యమాల ద్వారానే**
**బిజెపి కుట్రలను తిప్పికొట్టాలి**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వక్ఫ్ సవరణ చట్టం 2025 రాజ్యాంగ వ్యతిరేకమని దేశంలో మరో విభజనకు బిజెపి కుట్ర పన్నుతుందని వక్ఫ్ సవరణ చట్టం పేరుతో ముస్లింలను టార్గెట్ చేసిన బిజెపి ప్రభుత్వం రేపు క్రిస్టియన్లను కూడా టార్గెట్ చేయనుందని సంఘటిత ఉద్యమాల ద్వారానే దీనిని తొప్పికొట్టాల్సిన అవసరం ఉందని పలు పార్టీల నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులు పిలుపునిచ్చారు. ఆదివారం ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆలిండియా ముస్లిం పర్సనల్ లా ఖమ్మం యూనిట్ ఆధ్వర్యంలో మహ్మద్ అసద్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేండ్ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గతంలో ముస్లిం మైనార్టీల లక్ష్యంగా తీసుకువచ్చిన సిఏఏ,ఎన్ఆర్‌సిలకు వ్యతిరేకంగా పోరాడిన విషయాన్ని గుర్తు చేస్తూ మత స్వేచ్చను హరిస్తున్న వక్ఫ్ సవరణ చట్టంతో మరోసారి బిజెపి ప్రభుత్వం మత కలహాలను రెచ్చగొట్టాలని చూస్తుందని ఆయన ఆరోపించారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ ముస్లింల ప్రయోజనాలను దెబ్బతీస్తూ వారి మత స్వేచ్ఛ హక్కులను కాలరాసే ఈ వక్ఫ్ చట్టం ప్రమాదకర చట్టమని ఆయన తెలిపారు. ప్రజాస్వామిక, లౌకిక, మేధావి వర్గాలు సంఘటితంగా వ్యతిరేకిస్తూ పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జామాతె ఇస్లామి హింద్ నాయకులు మహ్మద్ సాధిక్, మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, మహ్మద్ సలాం, ప్రజాపంథా మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, సిపిఎం రాష్ట్ర నాయకులు ఎం. సుబ్బారావు, తెలంగాణ ఉద్యమ కారులు డాక్టర్ కెవి కృష్ణారావు, సామాజిక ఉద్యమ కారులు గోపీనాథ్, చోటేబాబా తదితరులు పాల్గొన్నారు.

# డిస్పెన్సరీనీ ఏరియా హాస్పిటల్‌గా ఆధునీకరించాలి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణి జె.వి.ఆర్ డిస్పెన్సరీని ఏరియా ఆసుపత్రిగా ఆధునీకరించాలని బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతి కుమార్ కోరారు. ఆదివారం ఐ.ఎన్.టి.యు.సి నాయకులు సింగరేణి డిస్పెన్సరీని సందర్శించారు. అనంతరం ఉద్యోగులతో పలు సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ సత్తుపల్లిలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించి సుమారు 20 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఉద్యోగులకు సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. 2014 లో సత్తుపల్లిలో సింగరేణి యాజమాన్యం డిస్పెన్సరిని ఏర్పాటు చేసిందని, డిస్పెన్సరీలో అనేక సమస్యల వల్ల ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ముఖ్యంగా డిస్పెన్సరీలోసంజీవని అంబులెన్స్ లో కార్డియాక్ మానిటర్ ఏర్పాటు చేయాలని , డిస్పెన్సరీ కి వచ్చే ఉద్యోగులకు వెయిటింగ్ రూమ్, డిస్పెన్సరీ స్టాప్ బైక్ షెడ్, మ్యాన్ పవర్, స్టాఫ్ నర్స్, స్కావెంజర్ లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో



బాలాజీ (ఫిట్ సెక్రటరీ, కిష్టారం ఓసి), నాగేశ్వరరావు (ఫిట్ సెక్రటరీ, జె.వి.ఆర్ సి.హెచ్.పి), కోటేశ్వరరావు (ఇంచార్జ్ ఫిట్ సెక్రెటరీ, జె.వి.ఆర్ ఓసి) ఐ.ఎన్.టి.యు.సి కమిటీ నాయకులు పొట్టి కిరణ్, రషీద్, అశోక్, సతీష్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# భూభారతితో భూ సమస్యల పరిష్కారం

**ప్రజాపక్షం/ఇల్లెందు:** కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న కొత్త చట్టం భూభారతితో రైతుల భూసమస్యలు పరిష్కారం చూపుతోందని ఎమ్మెల్యే కోరం కనకయ్య పేర్కొన్నారు. మండలంలోని బొజ్జాయిగూడెం పంచాయితీలోని ఎస్ ఎస్ గార్డెన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన భూభారతి అవగాహన సదస్సులో మాట్లాడారు. భూ సంబంధిత సమస్యలతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని, ఇటువంటివి తలెత్తకూడదనే ప్రభుత్వం కొత్తచట్టం తెచ్చిందని అన్నారు. భూ సమస్యలు మార్పులు చేర్పులు, మ్యుటేషన్, ఇతర సమస్యలకు ఈ భూభారతి చట్టం పరిష్కారం చూపుతుందన్నారు. ఈ చట్టం రైతులకు మాత్రమే కాదని, అధికారులకు కూడా ధైర్యం ఇచ్చిందని, సమస్య ఎంత తీవ్రమైనదైనా నాలుగు అంచెల్లో పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ చట్టంపై రైతులు, ప్రజలకు అవగాహన కల్పించడానికే ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేతోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ భూభారతి చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధు, డీఎల్‌పీఓ రమణ, తహసీల్దార్ తోట రవికుమార్, ఎంపీడీఓ దన్‌సింగ్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మండల, పట్టణ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# తలసేమియా పిల్లలకు అండగా నిలుద్దాం



**ప్రజాపక్షం/వైరా:** తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 75వ జన్మదిన సందర్భంగా తలసేమియా పిల్లల కోసం రక్తదానం చేసిన వైరా మున్సిపాలిటీ 9వ వార్డుకు చెందినఅయ్యప్పచౌదరి, ఇప్పటికి 16 సార్లు అయ్యప్ప వరుసగా రక్తదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా అయ్యప్ప మాట్లాడుతూ మనం చేసే రక్తదానం ఆపదలో ఉన్నవారికి ఎంతో అండగా ఉంటుందని ఆయన తెలిపారు.

# కల్లూరులో వేసవి శిక్షణ శిబిరం

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని మినీ స్టేడియం ఆవరణలో కల్లూరు మండలం నందు ఉన్న విద్యార్థినీ విద్యార్థులకు పలు రకాల క్రీడలు శిక్షణకు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని పిఈటి వీరరాఘవయ్య ఆదివారం తెలిపారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇష్టం ఉన్న క్రీడలను నేర్చుకునేందుకు శిక్షణ జరుగుతుందని వారు పేర్కొన్నారు. షటిల్, బాల్ బ్యాడ్మింటన్, ఇండోర్ వాలీబాల్, అవుట్డోర్ కబడ్డీ, ఇండోర్, ఔట్డోర్ పలు రకాల క్రీడలలో శిక్షణ ఇవ్వబడుతుందని వివరించారు. ఈ క్రీడ శిక్షణ 21వ తేదీ సోమవారం నుండి నెల రోజుల పాటు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# మధిరలో నేడు మెగా జాబ్‌మేళా

**ప్రజాపక్షం/ మధిర :** మధిర నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించే లక్ష్యంగా 80కంపెనీలతో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సారధ్యంలో రెడ్డి గార్డెన్స్ ఫంక్షన్ హాల్ వేదికగా సోమవారం జరగనున్న మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని డిప్యూటీసిఎం మల్లు భట్టివిక్రమార్క ప్రారంభించనున్నారు. నియోజకవర్గంలోని 5వేల మందికిపైగా నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు ఇప్పించేందుకు నిర్వహించే ఈ జాబ్ మేళాకు రాష్ట్ర రాజధాని హైద్రాబాద్ నుండి 80 ప్రైవేట్ కంపెనీలు రానున్నాయి. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు వారి విద్యా అర్హతను బట్టి కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారు. ఉద్యోగాల కోసం ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందచేస్తారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సారధ్యంలో జరిగే ఈ మెగా జాబ్ మేళాకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. గత వారంరోజుల నుంచి మెగా జాబ్ మేళాకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయా గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు వాల్ పోస్టర్లు అంటించి, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి విస్తృతంగా ప్రచారం చేశారు. అభ్యర్థుల పేరు నమోదు కోసం ప్రత్యేకంగా క్యూ ఆర్ కోడ్ కూడా ఏర్పాటు చేశారు. మధిరలో నేడు జరిగే జాబ్ మేళాకు నియోజకవర్గం నుండి వేలసంఖ్యలో పెద్ద ఎత్తున నిరుద్యోగ యువతీ యువకులు రానున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# కల్లూరులో ఈస్టర్ డే వేడుకలు



**ప్రజాపక్షం/కల్లూరు:** మండల పరిధిలో కల్లూరు పెద్ద కోరుకొండి విచారణల పరిధిలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారు వరకు ఏసు పునరుత్థాన మహోత్సవ పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. శిలువపై మరణించిన ఏసు ప్రభు మూడో రోజున సమాజం నుంచి లేచి భక్తులకు ప్రత్యక్షమైనట్లు మత బోధకులు జోజిబాబు, సురేష్ ఆయా చర్చిలలో బోధించారు. ఈ సందర్భంగా భక్తి గీతాలు ఆలపించారు. ప్రభు మూడో రోజున లేచిన సమాధుల వద్ద కొవ్వొత్తులను వెలిగించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ సహోదరులు ఒకరినొకరు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కన్య స్త్రీలు, ఉపదేశకులు, సంఘ పెద్దలు, సంఘస్తులతో పాటు వెంకటాపురం, చెన్నూరు, చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, ఎర్రబోయినపల్లి తదితర 10 గ్రామాల క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం లింగాల గ్రామంలో ఆదివారం రాత్రి ఎమ్మెల్సీ కవితకు అభిమానులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. లింగాలలో దేవరపల్లి పట్టాభిరామ్ గృహప్రవేశ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్సీ కవితకు మండల పరిధిలోని బి.ఆర్.ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు ఘన స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఆమె మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం రాబోతుందని కార్యకర్తలకు ధైర్యం తెలిపారు. నిరుత్సాహ పడవద్దని కొద్ది రోజుల్లోనే మన పరిపాలన రాబోతుందని పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కార్యకర్తలు, నాయకులు, మాజీ ఎమ్మెల్యే వెంకట వీరయ్య, ప్రజా ప్రతినిధులు ఎంపీపీ రఘు, జెడ్పిటిసి అజయ్ కుమార్ , బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పాలెపు రామారావు పాల్గొన్నారు.

# మిత్రుని కుటుంబానికి సహచర మిత్రుల అండ



**ప్రజాపక్షం/పెనుబల్లి:** మరణించిన మిత్రుని కుటుంబానికి సహచర మిత్రులు అండగా నిలిచి స్నేహ ధర్మం పాటించారు. చిన్న నాటి మిత్రుడు అకాల మరణంతో సహచర మిత్రులు దిగ్భ్రాంతి చెంది విచారం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. వియం బంజరు జడ్పీఎస్ స్కూల్లో 1996 97 పదవ తరగతి చదువుకున్న పెనుబల్లి మండలం అగ్రహారం గ్రామానికి చెందిన గొల్లమందల వెంకటేశ్వరరావు కిడ్నీ సంబంధింత వ్యాధితో కన్నుమూశాడు. సహచర పోటీ మిత్రులు గొల్లమందల వెంకటేశ్వరరావు కుటుంబానికి కుమారుడు పవన్ కళ్యాణ్, కుమార్తె స్వాతి లకు అండగా ఉంటామని భరోసాని కల్పించారు. తమ వంతు సాయంగా మిత్రులు ఈశ్వర్, కోటా శ్రీనివాసరావు, షేక్ బాజీ, వెంకటాచారి, మందా వెంకటేష్, గొల్లమందల వెంకటేశ్వరరావు ఇతర గ్రూపు మిత్రుల ద్వారా సేకరించిన రూ. 36,700/లు, 50 కేజీల బియ్యాన్ని ఆదివారం అందజేశారు.

## చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం మం డల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదినోత్సవ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు సిరిశెట్టి కమలాకర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పాయం లక్ష్మీ నారాయణ, చందా రాఘవులు, పార్లమెంట్ ఎస్టీ సెల్ నాయకులు వీసం సత్యనారాయణ, మండల నాయకులు ఆవుదొడ్డి శ్రీనివాస్ శ్రావణ్, దేగల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు




ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదినం పురస్కరిం చుకుని ఎర్రుపాలెంలోని పార్టీకార్యాలయంలో టిడిపి పార్టీ కన్వీనర్ దోమందుల సామేలు ఆధ్వర్యంలో ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జన్మదిన కేక్ కట్ చేసి చంద్రబాబు నాయుడు నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలో కూడా వారి సేవలు ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గురిజాల సత్యనారాయణ, సీనియర్ నాయకులు గూడూరు వెంకటేశ్వర్‌రెడ్డి, జవ్వాజి భాస్కర్‌రావు, వాసిరెడ్డి శికుమారి, వెంకటేశ్వరరావు, రాజా వెంకటేశ్వర్లు ఎస్కే లాల్‌మస్తాన్, శీలం నాగిరెడ్డి, కొర్లపాటి శ్రీనివాసరావు వరికూటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/మణుగూరు: మండల తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలు టిడిపి నియోకవర్గ నాయకులు వట్టం నారాయణ దొర అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు అందజేశారు. ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ మనందరికీ ఆదర్శ నాయకుడు ఎన్‌టిఆర్ అయితే.. ఆయన ఆశయాలను, రాజకీయ పార్టీని, పాలనను భావితరాలకు అందజేస్తున్న నాయకులు చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బచ్చల భారతి, మండల నాయకులు మల్లిడి లోకేష్, యార్లగడ్డ రాజా, మునునూరి చందర్ రావు, ఉప్పలపాటి రాంబాబు, కేశవులు, హరి, పూర్ణ, బోల్ల ఆంజనేయులు, మద్దెల భద్రయ్య, తాతా ప్రసాద్, సత్యనారాయణ, పాపా నాగేశ్వరరావు, గురువారెడ్డి, తెలుగు యువత నాయకులు బచ్చల సుమేశ్, పోశాం రాము, తాతా సాయి భారత్, మల్లయ్య, మహిళా నేతలు కమురున్నీషా బేగం, మడి శాంత, రమ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బోడేపూడి వైద్యశిబిరం విజయవంతం

**వేసవి కాలంలో బిపి, షుగర్ పేషెంట్లు జాగ్రత్తగా ఉండాలి**
**వైద్య బృందం చీకటి భారవి, పిల్లలమర్రి సుబ్బారావు**



ప్రజాపక్షం/వైరా: సిపిఎం వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెల మూడో ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయం బోడేపూడి వెంకటేశ్వరరావు భవనం నందు నిర్వహించే బోడేపూడి కళానిలయం వైద్య శిబిరాన్ని ఆదివారం 118వ నెల విజయవంతంగా నిర్వహించారు. వైరా పట్టణ సిపిఎం పార్టీ బోడేపూడి వైద్యశిబిరం ద్వారా గత 118 నెలలుగా షుగర్, బిపి, కొలెస్ట్రాల్, గ్యాస్, అల్సర్ తదితర వ్యాధులకు నెల రోజులకు సరిపడా మందులను రూ.100లకు అందిస్తున్నారు. ఆదివారం బోడేపూడి వైద్యశిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు బృందం ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించారు. 118 నెలలుగా బోడేపూడి వైద్యశిబిరం డాక్టర్ల బృందం ప్రతి నెలా క్రమం తప్పకుండా హాజరు కావడం, ఉదయం 6గంటల నుండే వాలంటీర్లు నిబద్ధతతో పనిచేయడం వలన బోడేపూడి వైద్యశిబిరం విజయవంతంగా ముందుకు సాగుతూ వేలాది మంది పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు మాట్లాడుతూ ప్రతిరోజు వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చునని అన్నారు. షుగర్, బిపి మందులు దీర్ఘకాలంగా వాడే వారు గుండె కిడ్నీ, న్యూరో సంబంధించిన పరీక్షలు తరచూ చేయించుకోవాలని సూచించారు. ఎండల తీవ్రత పెరుగుతుందని బిపి, షుగర్, గుండె, ఇతర అనారోగ్య లక్షణాలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు బయట ఎక్కువగా తిరగవద్దని, రోజువారీగా తగినన్ని చల్లని మంచినీరు ఎక్కువగా తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోడేపూడి వైద్యశిబిరం బాధ్యులు బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు, బొంతు సమత, గుడిమెట్ల రజిత, గుడిమెట్ల మోహన్ రావు, అనుమోలు రామారావు, మాదినేని రజిని, మల్లెంపాటి ప్రసాద రావు, హరి వెంకటేశ్వరరావు, యనమద్ది రామకృష్ణ, కంభంపాటి సత్యనారాయణ, పాసంగులపాటి చలపతిరావు, ఐలూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై నిఘా..!

**- సరిహద్దుల్లో నిఘా నేత్రాలు**
**- సంయుక్త చెక్ పోస్టులు**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో అక్రమాలు చోటు చేసుకోకుండా పౌరసరఫరాల శాఖ నిఘా పెంచనుంది. ఇందు కోసం రాష్ట్ర సరిహద్దుల్లో సంయుక్త చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు. పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ అధికారులు, పోలీసులు దాడుల్లో పాల్గొంటారు. ఇందు కోసం సరిహద్దుల్లో సిసి కెమెరాలు కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిస్సా నుండి ధాన్యం పెద్ద ఎత్తున అక్రమంగా తరలివచ్చే అవకాశం ఉండటంతో పెద్ద ఎత్తున నిఘా పెంచుతున్నారు. అక్రమార్కులకు కళ్లెం వేసేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో బోనస్ రూ.500 తెలంగాణ ప్రజలకే చెందానే ప్రభుత్వల లభ్యం నెరవేరేలా క్షేత్రస్థాయి నుండే చర్యలు తీసుకుంటున్నారు. అతి కొద్దిరోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో యాసంగి (రబీ) ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. ఇది మొదలైన ఐదు రోజుల తర్వాత లారీల్లో తెలంగాణకు ధాన్యాన్ని తరలించేందుకు లారీలు క్యూలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ప్రతీ చెక్‌పోస్టుకు ఐదుగురు సిబ్బందిని నియమించనున్నారు. సరిహద్దున ఉన్న ఏపి, ఛత్తీస్‌గఢ్‌లో కొందరు బ్రోకర్లు పెద్దెత్తున సన్నబియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వలు చేసినట్లు ఫిర్యాదులు అందటంతో అధికారులు అప్రమత్తం మవుతున్నారు. వాటిని ఇటు తరలించి క్వింటాకు రూ.500 బోనస్ కాజేద్దామని దురుద్దేశ్యాన్ని నిలవురించేందుకు సంయుక్త దాడులు చేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి. అక్కడి వ్యాపారులకు ఇక్కడ సహకరించే వారిని గుర్తించి వారిపై కూడా కేసులు పెట్టేందుకు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఇతర జిలాల్లో రాష్ట్ర సరిహద్దుల్లో లారీలను కూడా అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది.

**మచ్చిక చేసుకుని, బోనస్ కాజేసి...**

తెలంగాణ రాష్ట్రంలో సన్నాలు క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ ఉండటంతో పొరుగు రాష్ట్రాల వారు ఇక్కడి వారిని మచ్చిక చేసుకుని ధాన్యాన్ని తీసుకొచ్చి దోచుకుందామని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇందు కోసం కొనుగోలు కేంద్రాల వారితో దోస్తీ, రైతులతో ఒప్పందాలు చేసుకుని ఈ దందాకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. పొరుగు రాష్ట్రాల నుండి సుమారు 1000 క్వింటాళ్ల ధాన్యం అక్రమంగా తరలివచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో 144 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందురు రంగం కాగా సుమారు 67వేల మెట్రిక్ టనున్నల ధాన్యాన్ని సేకరించాలనే అంచనాలతో అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. సన్నాలకు రూ.2320 తో పాటు క్వింటాకు అదనంగా రూ.500 బోనస్, బి గ్రేడ్ రకానికి రూ.2300 రేటు ఖరారు చేశారు.

**దృష్టి సారిస్తే ...**

పొరుగు రాష్ట్రాల నుండి వచ్చే ధాన్యాన్ని నిలవరించేందుకు అధికారులు దృష్టి సారిస్తే సరిపోతుంది. వరి సాగు చేయని భూముల వివరాలు అధికారుల వద్ద ఉంటే ఇది సాధ్యమే. కానీ అధికారులే దళారులతో కుమ్మక్కై ఇతర పంటలు వేసిన భూముల్లో వరి సాగైనట్లు చూపిస్తున్నట్లు తెలుస్తోంది. కొనుగోలు కేంద్రాల్లో రైతు అమ్మకాలు సాగించాలంటే తప్పని సరిగా పట్టాదారు పాస్ పుస్తకం అవసరం ఉంటుంది. దీని ఆధారంగానే ఆన్‌లైన్‌లో నమోదు చేసి రైతుల వద్ద నుండి ధాన్యం కొంటారు. అక్రమాలు నివారించాలంటే అధికారులు నీతిగా ఉండి ఏపే పంటుల సాగు చేశారు. ఎన్ని ఎకరాల్లో సాగు చేశారో మండలాల వారీగా లెక్కలు చేతిలో ఉంటే అక్రమార్కుల ఆటలు ఇట్టే కట్టిపడేయవచ్చని పలువురు అంటున్నారు.

# తల్లిదండ్రులు మందలించారని మరో యువకుడి ఆత్మహత్య

ప్రజాపక్షం/నేలకొండపల్లి : ఖరీదైన మొబైల్ కొన్నందుకు తల్లిదండ్రులు మందలించారని, ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని శంకరగిరితండా కు చెందిన ధారవత్ రాజు (24) గత రెండు రోజుల క్రితం ఖరీదైన మొబైల్ ను కొనుగోలు చేశాడు. కాగా ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా అంత ఖరీదు పెట్టి ఎందుకు కొనుగోలు చేశావని, పైగా ఏ పని చేయటం లేదని, తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్థాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మం హాస్పిటల్ చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు. మృతదేహంను స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ పోస్టుమార్టమ్ నిర్వహించారు.



# అడ్డగోలుగా మట్టితోలకాలు..!

**-చెరువులు, గుట్టలే టార్గెట్**
**-బీటలు వారుతున్న చెరువు కట్టలు**
**-చోద్యం చూస్తున్న అధికారులు**



ప్రజాపక్షం/సత్తుపల్లి: అక్రమ సంపాదనకు అలవాటుపడిన మట్టి మాఫియా దెబ్బకు ఏ భూములు ఆగట్లే. ప్రభుత్వ భూములు, చెరువులు, గుట్టలు ఎక్కడ దొరికితే అక్కడ అడ్డగోలుగా మట్టిని తోడేస్తున్నారు. అడ్డగోలుగా మట్టి దందాను ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్నా ఏ ఒక్క అధికారి కూడా ఆ వైపు కన్నెత్తి చూడకపోవటంలో ఆంతర్యమేమిటో అధికారులే చెప్పాలి మరి. రాత్రి, పగలు తేడా లేకుండా లారీల కొద్ది మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్న మట్టి మాఫియా, చెరువులలో భారీగా గుంతలు పెడుతుంది. రేగడ మట్టిని వ్యవసాయ అవసరాల కోసం తవ్వి చెరువు పూడిక తీయాల్సి ఉన్నా.. అక్రమ సంపాదనకు అలవాటు పడిన మాఫియా భారీగా గుంతలు పెట్టడంతో గ్రావెల్ బయట పడుతుంది. గ్రావెల్ ను ఒక్కో ట్రిప్పు రూ. 4000 వేలకు అమ్మి సొమ్ము చేసుకుంటుంది. సత్తుపల్లి మండలంలోని రేజర్ల చెరువు, సదాశివునిపాలెం చెరువు, గంగారం గుట్ట, కొమ్మేపల్లిలోని భూములలో అక్రమ మట్టి దందా యదేచ్ఛగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజా సంఘాలు, ప్రకృతి ప్రేమికులు మండి పడుతున్నారు. చెరువు, గుట్టలలోని మట్టిని మండల కేంద్రానికి సమీపంలోని పలు వెంచర్లు, ఇళ్ళ స్థలాలు, ఖాళీ ప్రదేశాలలో నింపుతున్నారు. కొన్ని నెలలుగా ప్రభుత్వ, ప్రైవేట్, అసైన్డ్ భూమిలలో మట్టిని అమ్ముకుని వ్యాపారులు రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. లారీల కొద్దీ మట్టి తరలిపోతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు..



**బీటలు వారుతున్న చెరువు కట్టలు..**

సత్తుపల్లి మండలంలోని ఆయా గ్రామాలలో గల చెరువులలో అక్రమ మట్టి తోలకాలు జరుగుతుండడంతో చెరువు కట్టలు ధ్వంసమవుతున్నాయి. పరిమితికి మించి వాహనాలను మట్టిని నింపుతుండడంతో బరువుకు చెరువు కట్టలు కృంగిపోతున్నాయి. ఇదే మాదిరి మరికొన్ని రోజులు జరిగితే రానున్న రోజులలో చెరువుల నుండి కట్టలు తెగి పంట పొలాలు కొట్టుకుపోయే అవకాశం ఉందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**మూణ్ణాళ్ళ ముచ్చటగా బీటీ రోడ్లు...**

అక్రమ మట్టి లోడుతో టిప్పర్లు, ట్రాక్టర్లు రయ్ ,రయ్ మంటూ తిరుగుతుండటంతో కొత్తగా పోసిన బీటి రోడ్డు నాశనమవుతున్నాయి. చెరువు కట్టలు, బీటి రోడ్లు నాశనమవుతున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకోవటం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఎర్రమట్టికి భలే డిమాండ్...**

సత్తుపల్లి మండలంలోని కొమ్మేపల్లి, రేజర్ల,గంగారం ఏరియాలో మట్టి లభ్యత ఎక్కువగా ఉంటుంది. ఇది వెంచర్లకు ఉపయోగకరంగా ఉండడంతో అక్రమార్కులు అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో తవ్వకాలకు తెగబడుతున్నారు. రెవెన్యూ అధికారులు సహకరిస్తుండడంతోనే ఈ దందా యధేచ్ఛగా సాగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎర్రమట్టికి మంచి డిమాండ్ ఉండడంతో కొందరు అక్రమార్కులు మట్టి వ్యాపారం వైపు మొగ్గు చూపుతున్నారు. గ్రామ సమీపంలోని చెరువులలో భారీగా గుంతలు పెడుతుండటంతో వర్షాకాలంలో చెరువులు నిండి ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలు నిండిన నీటిలో పిల్లలు పడి మృత్యువాత పడే ప్రమాదముందని గ్రామస్తులు వాపోతున్నారు. మట్టి తోలకాలపై అధికారులు చర్యలు తీసుకోకపోతే, ఆయా శాఖల అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని ప్రజా సంఘాల నాయకులు, రైతులు తెలుపుతున్నారు.

# ఘనంగా సీతారామచంద్రస్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ

**పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**

ప్రజాపక్షం/లక్ష్మీదేవిపల్లి : లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ళ గ్రామంలో శ్రీ సీతారామాంజనేయ స్వామి వారి దేవాలయంలో శ్రీ సీతారామచంద్ర, లక్ష్మణ సహిత శ్రీ రామలింగేశ్వర స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో ఆదివారం సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా పాల్గొన్నారు. ఆలయ అర్చక సిబ్బంది వారికి సంప్రదాయ బద్ధంగా ఆహ్వానం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు, రాముల వారి కృపతో రేగళ్ల ప్రాంతం సస్యశ్యామలం కావాలని, అందరూ సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో, అష్టఐశ్వర్యాలతో తులనాడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, కంటెం



శ్రీనివాస్, మిరియాల రాము, దేవరగట్ల రాంబాబు, కోడి లింగయ్య, మాడెం రాంప్రసాద్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతిపై ప్రతీఒక్కరికి అవగాహన కల్పించాలి

ప్రజాపక్షం/నేలకొండపల్లి : భూ భారతి చట్టం పై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలం లోని రాయగూడెం, బోదులబండ గ్రామాలలో ఆదివారం రెవిన్యూ గ్రామ సభలను నిర్వహించారు. గ్రామ సభలను జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరిలు తనీఖీ చేశారు. రిజిష్టర్ నమోదు ను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రైతుల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్యల పై దరఖాస్తులు వస్తున్నాయి అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూ భారతి చట్టం పై క్షేత్ర స్థాయిలో ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. రైతులకు తమ భూముల విషయంలో ఉన్న ఆ భద్రతా భావాన్ని తావు నీయకుండా జవాబుదారుతనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టం ను చేపట్టం జరిగిందని అన్నారు. రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూభారతి చట్టం ఉందని అన్నారు. గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, తస్జల్ హుస్సేన్. డిప్యూటీ తహాశీల్దార్ ఇమ్రాన్, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ లు ఆలస్యం మధుసూదన్ రావు, అల్లం రవి, గ్రామ పెద్దలు బోయిన వేణు, సూరేపల్లి రామారావు, తీగ రమణయ్య, పతానాపు నాగయ్య, దేగల వేణు తదితరులు పాల్గొన్నారు.




## పలు శుభకార్యాల్లో పాల్గొన్న మాజీ జెడ్‌పిటిసి దంపతులు



ప్రజాపక్షం/బూర్గంపాడు: పలు శుభకార్యాల్లో బూర్గంపాడు మండల మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డి దంపతులు హాజరయ్యారు. ఆదివారం పాల్వంచ మండలం జగన్నాధపురం పెద్దమ్మ తల్లి సన్నిధి అమ్మ ఫంక్షన్ హాల్ నందు ఆవుల మోహన్‌రెడ్డి(లేటు), సత్యవతి దంపతుల కనిష్ఠ పుత్రుడు ప్రశాంత్‌రెడ్డి, మమతరెడ్డిల రిసెప్షన్ వేడుకకు హాజరయ్యారు. ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా శ్రీకనకదుర్గ ఫంక్షన్ హాల్ నందు నిర్మల నాగేష్, దేవి దంపతుల ఏకైక పుత్రిక మేఘన, నవీన్‌ల కళ్యాణ మహోత్సవ వేడుకకు హాజరై, నవ వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. బూర్గంపాడు మండలంలోని రెడ్డిపాలెం గ్రామ పంచాయితీలో గల కారుమూడి ఈశ్వర్ రెడ్డి, పద్మవతి దంపతుల ప్రథమ పుత్రుడు అశోక్‌రెడ్డి, ప్రశాంతిల కళ్యాణ మహోత్సవ వేడుకకు హాజరై, నవ వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మోతే పట్టినగర్ గ్రామ పంచాయితీలో సంతపురి వెంకటేశ్వర్లు, రమణ దంపతుల కనిష్ఠ పుత్రుడు శ్రీకాంత్, జ్యోతిల కళ్యాణ మహోత్సవ వేడుకకు హాజరై, నశ వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలను తెలిపారు. ఈకార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, గోనె దారుగా, శ్రీనివాసరెడ్డి, జై చంద్ర, నుసుము వెంకటరామిరెడ్డి, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాపక్షం/గుండాల : సాయనపల్లి గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ గ్రామ శాఖ సభ్యుడు ఎరెం రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు,వారికుటుంబాన్ని పరామర్శించేందుకు ఆపార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్టకమిటి సభ్యులు ఎజె రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు రేపాకులశ్రీనివాస్ లు ఆదివారం సాయనపల్లి గ్రామానికి వెళ్లి మృతుడు రమేష్ కుటుంబాన్ని పరామర్శించారు.వారుమాట్లాడుతూ రమేష్ పార్టీ సభ్యునిగా ఉంటు అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని , క్రమశిక్షణతో కలిగి ఉండే వారని గుర్తు చేశారు. కార్యక్రమంలో తోలెం గోపి, మాజి సర్పంచి దుగ్గి రామూర్తి, తదితరులు ఉన్నారు.

## వెంకట్‌కు అభినందనలు



ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి మండల పరిధిలోని దుబ్బతండ గ్రామానికి చెందిన భూక్య వెంకట్ చరణ్ జేఈఈ వెయిన్ ఫలితాలలో ఆల్ ఇండియా ఎస్టీ కేటగిరీలో 1047 ర్యాంక్ సాధించారు. అతనని కళాశాల అధ్యాపక బృందం, గ్రామస్తులు అభినందించారు.

## కుంటలను కాపాడాలి



ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి గ్రామ పంచాయితీలో ఉన్న కుంటల పెద్ద చెరువు కబ్జాలకి, డంపింగ్ యార్డ్‌గా మారుతుంది. కట్టే ఇండ్లకి గ్రామ పంచాయితీ పరిధిలో సెక్రటరీ దగ్గర పర్మిషన్ తీసుకొని ఆ ఇల్లు కట్టేవాళ్ళు వాటి కింద ఉన్న చెత్త, మట్టి తీసాకపోయి సుబ్బాయ కుంటలో పెసి దాన్ని డంపింగ్ యార్డ్‌గా మారుస్తున్నారు. కావున అధికారులు తక్షణమే స్పందించి చెరువులోని, సింగరేణి గ్రామ పంచాయితీలో ఉన్న కుంటలని కాపాడి ఈ పోసే వారిపై చట్ట పరిధిలో చర్య తీసుకోవాల్సిందిగా సింగరేణి గ్రామ ప్రజలు కోరుతున్నారు. కుంటలను కాపాడాల్సింగా భారతీయ జనతా పార్టీ సింగరేణి మండల శాఖ డిమాండ్ చేస్తున్నారు.

# సుర్రుమంటున్న ఎండలు..!

-ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి
-మధ్యాహ్న సమయంలో రోడ్లపై కానరాని జనం
-గతేడాది కంటే అధికస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు

ఏప్రిల్ నెలలోనే భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మధ్యాహ్నం 12 గంటలకే ఇండ్ల నుంచి రాలేని దుస్థితి నెలకొంది. ఉదయం తొమ్మిది గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మధ్యాహ్నం సమయంలో ఉక్కపోతతో కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. రాత్రిపూట కనిష్ట స్థాయికి చేరుతున్నాయి. రాత్రి సమయంలో చలి అల్లాడిస్తుంది. పగటిపూట మాత్రం ఎండ వేడిమి అధికంగా ఉంది. జిల్లా వ్యాప్తంగా చింతకాని, ముదిగొండ మండలాల్లో గరిష్టంగా 42.8 డిగ్రీలు నమోదు కాగా కనిష్టంగా 29.5 డిగ్రీలు వైరా నియోజక వర్గ పరిధిలోని ఏన్కూరు మండలంలో నమోదైంది. ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** సాధారణంగా ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఆకాశం మేఘావృతమై ఎండల తీవ్రత అంతగా ఉండదు. ఏప్రిల్, మే నెలల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ సాయంత్రం మేఘాలు కమ్ముకుని చిరుజల్లులు పడేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. వర్షాకాలంలోనూ ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. సాధారణంగా జూన్ రెండవ వారంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించి వాతావరణం చల్లబడుతుంది. అయితే ఇందుకు భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎండల ప్రభావం కూడా క్రమేపి పెరుగుతుంది. గతంలో ఎప్పుడు లేనివిధంగా ఏప్రిల్ నెలలో ఎండల తీవ్రత అధికంగా ఉంది. దీనితో సామాన్య జీవనానికి విఘాతం కలుగుతుంది. వృద్దులు, పిల్లలు, యువకులు అనే తేడా లేకుండా అల్లాడిపోతున్నారు. గత కొన్ని రోజులుగా ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది. భిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

# రజతోత్సవ సభకు తరలిరండి

-25న మండల కేంద్రాల్లో జెండా ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ఖమ్మం :** రజతోత్సవ సభకు బిఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని బిఆర్ఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. బిఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశం ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు తాతా మధు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఈనెల 27న ఉమ్మడి జిల్లా నుంచి ప్రజలను తరలించేందుకు సంబంధించిన ఏర్పాట్లు, భోజనం, త్రాగునీరు, వాహనాలు తదితర విషయాలను చర్చించడంతో పాటు కార్యకర్తలకు బహిరంగ సభ రూటు మ్యాపు వంటి తదితర విషయాలను వివరించాలని నిర్ణయించారు. ఈనెల 25న అన్ని మండల కేంద్రాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించాలని, పార్టీ గద్దెలకు రంగులు వేసి ముస్తాబు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. 27న గ్రామాల్లో జెండాలను ఆవిష్కరించి వరంగల్‌కు ఏర్పాటు చేయబడిన వాహనాల్లో బయలుదేరి రావాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపి వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ శాసన సభ్యులు రేగా కాంతారావు, వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి, కొండబాల కోటేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, బానోత్ హరిప్రియ, బానోత్ మదన్‌లాల్, బానోత్ చంద్రావతి, మాజీ జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, రావులపల్లి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మైక్రో ఫైనాన్స్ సంస్థ వేధింపులపై
# డిజిపి కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన మహిళ




**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** ఖమ్మంజిల్లా చింతకాని మండలం వందనం గ్రామానికి చెందిన విజయలక్ష్మి అనే మహిళ తన భర్తకు యాక్సిడెంట్ జరిగితే చికిత్స నిమిత్తం 2019లో ఇంటి కాగితాలు తనఖా పెట్టి రూ.2.50 లక్షలు ఫైవ్ స్టార్ ఫైనాన్స్ నుంచి అప్పుగా తీసుకుంది. ఆ తర్వాత ఫైనాన్స్ కంపెనీ వేధింపులు తట్టుకోలేక భర్త ఆత్మహత్య చేసుకోగా తాను ఫైనాన్స్ కంపెనీ ద్వారా తీసుకున్న డబ్బును విడతల వారీగా ఆ మహిళ మూడు లక్షల రూపాయల వరకు చెల్లించింది. ఇదేమిటని ప్రశ్నించినందుకు వారం తర్వాత రూ. 4.50 లక్షలు చెల్లించాలని ఫైనాన్స్ కంపెనీ తెలిపింది. దీనిపై బాధితురాలు పోలీసులను కలవడంతో ఆ మొత్తాన్ని ఆరు లక్షల రూపాయలకు ఫైనాన్స్ సంస్థ పెంచింది. దీనితో మహిళ తన బావతో కలిసి వెళ్లి ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ ఎదుట నిరసన తెలపగా సదరు కంపెనీ రూ. 50 లక్షలు చెల్లించి సెటిల్ చేసుకోవాలని బెదిరింపులకు పాల్పడింది. అసలే భర్తను కోల్పోయిన తనకు ఫైనాన్స్ కంపెనీ వారు అర్ధరాత్రి వీడియో కాల్స్ చేసి వేధిస్తున్నారని బోరున విలపించిన తన గోడును డిజిపి జితేందర్‌కు తెలిపేందుకు వెళ్లగా కార్యాలయ సిబ్బంది ఆమెను లోపలికి అనుమతించకపోవడంతో డిజిపి కార్యాలయం ఎదుట నిరసన తెలిపింది. డబ్బులు చెల్లించడం లేదని ఇంటికి తాళాలు వేయడం, అర్ధరాత్రి వీడియో కాల్స్ చేయడం వంటివి చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆమె డిజిపి కార్యాలయం ఎదుట కన్నీటిపర్యంతమైంది.

# ఘనంగా ఏపి సిఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు




**ప్రజాపక్షం/ఇల్లెందు:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలను పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ జన్మదిన కేక్‌ను ఇల్లెందు నియోజకవర్గ కన్వీనర్ ముద్రగడ వంశీ మాట్లాడుతూ..75సంవత్సరంలోకి అడుగుపెడుతున్న నారా చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని కోరుకుంటూ 28ఏళ్లకే మంత్రిగా, 9సంవత్సరాల9నెలలు ముఖ్యమంత్రిగా 13సంవత్సరాలు ప్రతిపక్షనేతగా ఇటు రాష్ట్రంలోనూ సేవలందించిన చంద్రబాబు నాయుడు తన విజన్‌తో ఉమ్మడి రాష్ట్రాన్ని ఎంతో ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కారు నర్సన్న, శ్యాం తివారి, ముల్కలపల్లి నాగేశ్వరరావు, పుచ్చకాయల సత్యనారాయణ, చిలిమల బాబు, కంది రవి, భాస్కరరావు, డి.శ్రీహరి, దాసరి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లాకు కల్వకుంట్ల కవిత




**ప్రజాపక్షం/భద్రాచలం :** కేసిఆర్ కుమార్తె, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత నేడు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ముందుగా ఉ.8 గం.లకు మణుగూరులోని బిఆర్ఎస్ కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ కార్యకర్తలతో మాట్లాడిన అనంతరం ఉ.9 గం.లకు భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఉ.10గం. నుండి హరిత హోటల్లో తెలంగాణ వాదులు, బిఆర్ఎస్ ముఖ్యనాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తారు. మొదటి విడుదలైన షెడ్యూల్ ప్రకారం పర్ణశాల పర్యటనను రద్దు చేసుకున్నారు.

## ఏపి సిఎంకు జన్మదిన శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలుగుదేశం పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఆదివారం సత్తుపల్లి మాజీ శాసనసభ్యు సండ్ర వెంకట వీరయ్య జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిరంతరం ప్రజాసేవకు అంకితమైన ఆయన జీవితం ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్లు సుఖశాంతులతో వర్ధిల్లాలని సండ్ర ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సుభిక్షంగా పాలన అందించేందుకు దేవుడు వారికి మరింత శక్తినివ్వాలని కోరుకున్నారు.

## ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఉపాధ్యాక్షుడుగా నేలకొండపల్లి కి చెందిన జెర్రిపోతుల సత్యనారాయణ మరోమారు నియమించారు. ఈ మేరకు ఆదివారం జిల్లా అధ్యక్షుడు మారగాని వెంకట్ చేతుల మీదుగా నియామకపు పత్రాలను అందించారు. 2025 నుంచి 2028 వరకు ఈ పదవిలో కొనసాగుతారని ఉత్తర్వలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. తన పై నమ్మకంతో రెండో సారి బాధ్యతలు అప్పగించినందుకు జిల్లా కమిటి కి కృతజ్ఞతలు తెలిపారు. సమస్యల పై తన వంతు గా శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి కనకరావు, కమటం రఘు, నేలకొండపల్లి మండల కార్యదర్శి కొమ్మూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఈస్టర్ డే



**ప్రజాపక్షం/భద్రాచలం :** క్రైస్తవ ఆలయాల్లో ఆదివారం ఈస్టర్ డేని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెల్లవారుఝామునే ఆలయాలకు చేరుకున్న భక్తులు ఆనందోత్సహాలతో సంగీతనాదాలు చేశారు. ఏసుక్రీస్తును శిలువవేసిన తర్వాత మూడో రోజు వచ్చే ఆదివారం రోజు ఆయన పునరుద్ధానుడయ్యాడని క్రైస్తవుల ప్రఘాట విశ్వాసం. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాలను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పిల్లలు, పెద్దలు నూతన వస్త్రాలను ధరించి ఆలయాలకు చేరుకుని వేడుకల్లో పాల్పంచుకున్నారు. క్రైస్తవ బోధకులు ఏసు క్రీస్తు పునరుద్దానుడైన వివరాలను బైబిల్‌లో నుండి సేకరించి వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు సంగీతనాధాలు జరిపించారు. కొత్తగూడెం సెయింట్ ఆడ్రూస్ చర్చి, భద్రాచలం సిఎస్ఐ ప్రధాన చర్చితో పాటు జిల్లాలోని పలు క్రైస్తవ ఆలయాల్లో ఈ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.

## గిరిజన దర్బారుకు అధికారులు సకాలంలో హాజరుకావాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఐటిడిఏలో నేడు నిర్వహించే గిరిజన దర్బార్‌కు అధికారులు సకాలంలో హాజరు కావాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐటిడిఏ పరిధిలోని గిరిజన గ్రామాల నుండి గిరిజనులు తమతమ సమస్యల పరిష్కారం కోసం అధికారులపై నమ్మకంతో ఇక్కడి వచ్చి దరఖాస్తులు అందిస్తుంటారని, ఆయాశాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

**ప్రజావాణి రద్దు...**

ఐడిఓసిలో నేడు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూ భారతి పై ప్రజలకు అవగాహన కల్పించే విషయంలో అధికారులు ఉన్నందున ఈ వారం ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

## భూ భారతిపై అవగాహన సదస్సును జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/మణుగూరు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం 2025 గురించి మణుగూరు లోని కిన్నెర కల్యాణ మండపం నందు నేడు ఉదయం 10:00 గంటలకు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పీరినాకి నవీన్ తెలిపారు. ఈ అవగాహన సదస్సులో భూభారతి చట్టం 2025 యొక్క ముఖ్య ఉద్దేశం, ఆ చట్టం విధి విధానాలను వివరించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథులుగా పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ భద్రాద్రి కొత్తగూడెం, రెవెన్యూ డివిజన్ అధికారి, మండల తహశీల్దార్ హాజరై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కావున మణుగూరు మండలంలోని ప్రజలు, రైతులు, అధికారులు, మీడియా ప్రతినిధులు ఈ అవగాహన సదస్సుకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.